ప్రజాశక్తి

శుక్రవారం 17 మే 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

పల్నాడు ఎస్‌పి సస్పెన్షన్

- కలెక్టర్ శివశంకర్ బదిలీ
- పలువురు డిఎస్‌పిలు, సిఐలపైనా చర్యలు
- ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అల్లర్లపై సీరియస్
- ఘర్షణలపై సిట్ ఏర్పాటు
- అధికారులపై శాఖాపరమైన విచారణకు ఆదేశం

ఎస్పీ బిందుమాధవ్

కలెక్టర్ శివశంకర్

డీఎస్పీ బిఎస్ఎన్ వర్మ

డీఎస్పీ పల్లపురాజు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున, అనంతరం పల్నాడు జిల్లాలో జరిగిన ఘర్షణలు, హింస ప్రజర్విల్లడంపై కేంద్ర ఎన్నికల కమిషన్ కన్నెర్ర చేసింది. అల్లర్లపై ప్రత్యేక దర్యాప్తు బృందాలు (సిట్) ఏర్పాటు చేసి తక్షణం బాధ్యులైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు ఎఫ్ఐఆర్‌లను అప్‌డేట్ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని దిశానిర్దేశం చేసింది. అల్లర్లను నియంత్రించడంలో విఫలమైన పల్నాడు జిల్లా ఎస్‌పి గరికపాటి బింధుమాధవ్‌ను ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసింది. ఈ మేరకు గురువారం రాత్రి ఆదేశాలు వచ్చాయి. ఈ ఘర్షణల నేపథ్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను తక్షణం బదిలీ చేయాలని శాఖపరమైన విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

పల్నాడు ఎస్‌పిగా బిందుమాధవ్ గతనెల 4న నియమితులయ్యారు. 5న బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అప్పటి ఎస్‌పి రవిశంకర్‌రెడ్డిని బదిలీ చేసి బింధుమాధవ్‌ను ఎస్‌పిగా నియమించారు. బిందుమాధవ్ గతంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అదనపు ఎస్‌పిగా పనిచేసి తొలిసారిగా పల్నాడు జిల్లా ఎస్‌పిగా నియమితులయ్యారు. ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన 40 రోజులకే సస్పెన్షన్ ఉత్తర్వులు అందుకోవం రాష్ట్రచరిత్రలో ఇదే తొలిసారని అధికారులు చెబుతున్నారు. మరోవైపు జిల్లా కలెక్టర్ శివశంకర్‌పై బదిలీ వేటు పడింది. ఆయనపైనా శాఖపరమైన విచారణకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వులిచ్చింది. 2022 ఏప్రిల్ 4న పల్నాడు జిల్లా తొలి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శివశంకర్ రెండేళ్లపాటు ఇక్కడే కొనసాగారు. ఎన్నికల సందర్భంగా కొన్ని బదిలీలు జరిగినా ప్రభుత్వం ఆయన్ను కొనసాగించింది.

2లో

పిన్నెల్లిలో స్వాధీనం చేసుకున్న పెట్రోల్ బాంబులు, ఇతర మారణాయుదాలు, ప్రమాదకర సామగ్రి

పిన్నెల్లి, మాదలలో పెట్రోల్ బాంబులు

- వైసిపి, టిడిపి నాయకుల వద్ద ఇతర మారణాయుధాలూ స్వాధీనం
- పోలీసుల అదుపులో పలువురు, పరారీలో మరికొందరు
- తాజాఘటనతో ఉలిక్కిపడ్డ పల్నాడు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

గురజాల నియోజకవర్గంలో తలెత్తిన రాజకీయ ఆలజడి కొనసాగుతోంది. గురువారం మాచవరం మండలం పిన్నెల్లిలో పెట్రోల్ బాంబులు బయటపడటంతో పల్నాడు ప్రజలు ఉల్లిక్కిపడ్డారు. సుమారు 50 పెట్రోల్ బాంబులు, మారణాయుధాలు దోరకడంతో గురజాల నియోజకవర్గ ప్రజలు ఈ గొడవలు ఇంకా ఎన్నాళ్లు సాగుతాయి అని భయాందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో ఘర్షణల నేపథ్యంలో పిన్నెల్లిలో పోలీసులు గురువారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించగా బాంబులు, మారుణాధాయలు బయటపడ్డాయి. దీనిపై దాచేపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ మీడియాతో మాట్లాడారు.

ముప్పాళ్ల మండలం మాదలలో స్వాధీనం చేసుకున్న పెట్రోల్ బాంబులు

పిన్నెల్లిలో టిడిపి, వైసిపిల మధ్య గొడవల దృష్ట్యా దాచేపల్లి సిఐ, మాచవరం ఎస్సైలు పిన్నెల్లికి చెందిన వైసిపి నాయకులు చింతపల్లి పెదసైదా, చింతపల్లి నన్నే,

2లో

5లో

విముక్తి నాటికలో సన్నివేశం

కొలంకపురి నాటక కళా పరిషత్ ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం

- సవ్యసాచి పురస్కారాన్ని అందుకున్న నటులు ఎమ్‌డి ఖాజావలి
- తొలిరోజు 'రైతేరాజు', 'విముక్తి' ప్రదర్శన

సమోసా వద్దు.. మందు ఓకే!

- 144 సెక్షన్ అమలులో పోలీసులు పక్షపాతం
- చిరువ్యాపారులపై జులుం.. మెడికల్ షాపులూ మూత
- నిర్మానుష్యంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట

2లో

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఇంటి వీధిలో వేసిన కంచె

వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ

బిసిజి వ్యాక్సినేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ముత్యాలరెడ్డి పట్టణ ఆరోగ్య కేంద్రంలో అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ప్రారంభించారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ టీ.బీ.విన్ పోర్టల్‌లో తమ పేరు నమోదు చేసుకొని వ్యాక్సిన్ తీసుకోవచ్చని, ప్రతి గురువారం ఈ వ్యాక్సిన్ సచివాలయాలలో ఇస్తారని అన్నారు. 60 ఏళ్లు పైబడిన వారు, టీబీ వ్యాధిగ్రస్తుల దగ్గరి కుటుంబ సభ్యులు, మధుమేహ

2లో

జులుంతో దెబ్బతింటున్న జీవనోపాధి

- 144 సెక్షన్ అమలుతో చిరువ్యాపారులకు ఇబ్బందులు
- ధరల పెరుగుదలకు అవకాశం ఇవ్వొద్దు
- ఘర్షణల నియంత్రణలో పోలీసులు విఫలం
- బెట్టింగుల నియంత్రణపై దృష్టి పెట్టండి
- పల్నాడు ఎస్పీ, కలెక్టర్‌కు సిపిఎం, ప్రజా సంఘాల వినతి

2లో

పల్నాడు ఎస్‌పి సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

నర్సరావుపేట డిఎస్‌పి బిఎస్ఎన్ వర్మ, గురజాల డిఎస్‌పి పల్లపురాజు, ఎస్‌బి సిఐ బాలనాగిరెడ్డి, సిఐ ప్రభాకరరావు, కారంపూడి ఎస్ఐ రామాంజనేయులు, నాగార్జున సాగర్ ఎస్ఐ కొండారెడ్డిని సస్పెండ్ చేసి వీరందరిపై శాఖాపరమైన విచారణకు ఎన్నికల కమిషన్ సూచించింది. ఎన్నికల షెడ్యూలు వెలువడిన తరువాత ఇప్పటి వరకు గుంటూరు రేంజి ఐజి పాలరాజు, పల్నాడు ఎస్‌పి రవిశంకర్‌రెడ్డిని గతనెల 2వ తేదీన బదిలీ చేస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది. ఆ తరువాత పల్నాడు జిల్లాలో పలువురు సిఐలు, ఎస్ఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈసారి ఏకంగా ఎస్‌పితోపాటు ఇద్దరు డిఎస్‌పిలు, మరో ఇద్దరు సిఐలు, ఇద్దరు ఎస్ఐలను సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించింది. ప్రత్యేకంగా కేంద్ర బలగాలను పంపినా, ముందుగానే నాలుగు నియోజకవర్గాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించినా దిగువ స్థాయి అధికారులు సమర్ధవంతంగా పనిచేయలేకపోయారని ఈసి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, డిజిపి హరిష్‌కుమార్ గుప్తాతో సమీక్ష అనంతరం ఎన్నికల కమిషన్ కఠిన చర్యలకు ఉపక్రమించిందని అధికార వర్గాలు తెలిపాయి.

పిన్నెల్లి, మాదలలో పెట్రోల్ బాంబులు

(మొదటి పేజీ తరువాయి)

అల్లాభక్షు, టిడిపికి చెందిన చింతపల్లి జానీబాషా, చింతపల్లి జానీ, తండా పెద్దనన్నేను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి మారుణాయుధాలు, రాళ్ల,సీసా పెంకులు, కత్తులు, గొడ్డళ్లు, పెట్రోల్ నింపిన చేసిన సీసాలు, రాళ్లు, సీసా పెంకులు స్వాధీనం చేసుకున్నారని వివరించారు. పెట్రోల్ బాంబులు తయారు చేసిన వ్యక్తినీ అదుపులోకి తీసుకున్నామని, పరారీలో ఉన్న ఇతరులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. నిందితులపై కేసులు నమోదు చేశామన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని మాదలలో 29 పెట్రోల్ బాంబులు కలకలం రేపాయి. ఎన్నికల నేపథ్యంలో జరిగిన ఘర్షణతో మండలంలో పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేస్తుండడంతోపాటు అనుమానం వచ్చినచోట సోదాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మాదలకు చెందిన వైసిపి నాయకుడు సైదా ఇంట్లో బాంబులున్నాయనే అనుమానంతో సిఐ రాంబాబు, ఎస్ఐ హజరత్తయ్య గురువారం తనిఖీలు చేపట్టగా 29 పెట్రోల్ బాంబులు దొరికాయి. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. సైదా పరారీలో ఉన్నట్లు సమాచారం.

బిసిజి వ్యాక్సినేషన్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

వ్యాధిగ్రస్తులు, గత ఐదేళ్లుగా టీ.బి వ్యాధితో బాధపడుతున్న వారు, ధూమపానం చేసేవారు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ కె.వి సుబ్బరాజు, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయనన్, డిఎస్ఎంఒ డాక్టర్ లక్ష్మ నాయక్, ఇతర వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ, రాజునాయక్, ఘంటసాల శ్రీనివాసరావు, గణేష్ పాల్గొన్నారు.

వినూత్నంగా 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్'

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ

ప్రతి ఒక్కరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న షో 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' కార్యక్రమానికి సరికొత్త తారాగణాన్ని ప్రకటించినట్లు ఎమ్మే ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రీజనల్ హెడ్ కె.రాజశేఖర్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో షో ప్రీ ఈవెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలిటికల్ థ్రిల్లర్ షోలో సరోజిని నాయుడుగా మలిష్కా, లియాఖత్ ఆలీఖాన్‌గా రాజేష్ కుమార్, వి.పి.మీనన్‌గా శంకర్ కె.సి. నటిస్తున్నారని తెలిపారు. సరోజిని నాయుడు పాత్రగురించి మలిష్క మాట్లాడుతూ ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్‌లో నైటింగేల్ ఆఫ్ ఇండియా సరోజిని నాయుడు పాత్ర పోషించడం గర్వకారణంగా ఉందన్నారు. ఎంతో చారిత్రాత్మక ప్రదర్శనను చక్కగా రూపొందిస్తున్నారని తెలిపారు.

సమోసా వద్దు.. మందు ఓకే!

- 144 సెక్షన్ అమలులో పోలీసులు పక్షపాతం
- చిరువ్యాపారులపై జులుం.. మెడికల్ షాపులూ మూత
- నిర్మానుష్యంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట

మల్లమ్మ సెంటర్ లో దుకాణాలు మూసివేయిస్తున్న పోలీసులు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల సందర్భంగా ఏర్పడిన వివాదాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీసులు ప్రకటించిన విషయం తెలిసిందే. మాచర్లలో పటిష్టంగా ఇది అమలవుతున్నా జిల్లా కేంద్రమైన నరసరావపేటలో కొంత భిన్నంగా ఉంది. చిరు వ్యాపారులను, చిన్నపాటి దుకాణదార్లను బెదిరించి దుకాణాలు మూయిస్తున్న పోలీసులు మద్యం దుకాణాలను మాత్రం యథేచ్ఛగా కొనసాగనిస్తున్నారు. రోడ్డు వెంట చిరుతిళ్లు అమ్ముకుని జీవన పోరాటం సాగించే వారిని చొక్కా పట్టుకు లాక్కెళ్లడం, వారి సామగ్రిని వాహనాల్లో వేసుకెళ్లడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. సమోసాలు అమ్ముకుంటే లాక్కెళ్తున్న పోలీసులు మద్యం అమ్మకాలను మాత్రం ఆపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. మెడికల్ షాపులనూ మూసేయిస్తున్నారు.

గుంటూరు రోడ్డులోని తన హాస్పిటల్‌లోనే నివాసం ఉంటున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి చెందిన హాస్పిటల్‌పై రాళ్ళ దాడి, కాన్వాయ్ ధ్వంసం ఘటనల నేపథ్యంలో ఏ క్షణం ఏం జరుగుతుందోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. దీంతో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడా పెద్ద వివాదాలు లేకున్నా నరసరావుపేట పట్టణంలో జరిగిన ఘర్షణల దృష్ట్యా శ్రీనివాసరెడ్డి ఇంటి వైపు ఆ వీధిలో ఎవరు వెళ్లకుండా బారికేడ్లు పెట్టడంతోపాటు ముళ్లకంచెను సైతం వేసి పహారకాస్తున్నారు.

ప్రధాన కూడళ్లలో దుకాణాలు మూసివేయించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాలోల వివాదాలు తమకు అవస్థలు తెచ్చిపెట్టాయని పట్టణ ప్రజలు నిట్టూరుస్తున్నారు. 144 సెక్షన్ అమలుపై జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను ప్రజాశక్తి సంప్రదించగా దుకాణాలు పోలీసులు బలవంతంగా ఏమీ మూయించడం లేదని, దుకాణదార్లే స్వచ్ఛందంగా మూసేస్తున్నారని చెప్పారు. మద్యం దుకాణాల నిర్వహణ, చిరు వ్యాపారులపై దౌర్జన్యం వంటివి తమ దృష్టికి రాలేదని, అయినా తమ సిబ్బంది తీరు మార్చుకోవాలని చెబుతామని అన్నారు.

నిర్మానుష్యంగా నరసరావుపేట పట్టణంలోని గుంటూరు రోడ్డు..

పల్నాడు రోడ్డులో ఒక వైపు తలుపు తెరిచి మద్యం విక్రయాలు సాగిస్తున్న బార్, రెస్టారెంట్

జులుంతో దెబ్బతింటున్న జీవనోపాధి

- 144 సెక్షన్ అమలుతో చిరువ్యాపారులకు ఇబ్బందులు
- ధరల పెరుగుదలకు అవకాశం ఇవ్వొద్దు
- ఘర్షణల నియంత్రణలో పోలీసులు విఫలం
- బెట్టింగుల నియంత్రణపై దృష్టి పెట్టండి
- పల్నాడు ఎస్పీ, కలెక్టర్‌కు సిపిఎం, ప్రజా సంఘాల వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల సందర్భంగా పల్నాడు జిల్లాలో 4 సమస్యాత్మక నియోజకవర్గాలను ప్రకటించిన ఎన్నికల కమిషన్, పోలీసు శాఖ ఆయా నియోజకవర్గాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఘర్షణలను నివారించడంలో పోలీస్‌శాఖ విఫలమైందని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో ఎస్‌పి జి.బిందుమాధవ్, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలిసి విన్నవించారు. జిల్లాలో శాంతిభద్రతలను పునరుద్ధరించాలని కోరారు. 144 సెక్షన్ అమలు పేరిట చిరువ్యాపారులపై పోలీసులు జులుం ప్రదర్శిస్తున్నారని, ఇది వారి జీవనోపాధిని దెబ్బతీస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. 144 సెక్షన్ ఎన్ని రోజులు అమలులో ఉంటేందో ప్రకటించలేదని, దీనివల్ల కూరగాయలు, పండ్ల వ్యాపారుస్తులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. మరోవైపు మద్యం దుకాణాలను మాత్రం మూయించడం లేదని అన్నారు. ఘర్షణల నివారణకు 144 సెక్షన్ అమలు పరిష్కారం కాదని, ఇరు పార్టీల రాజకీయ నేతలను, నేర చరిత్ర కలిగి వారిని అదుపులోకి తీసుకోవాలని కోరారు. బెట్టింగుల నియంత్రణపై దృష్టిపెట్టాలని, ఘర్షణలకు కారకులపై కేసులు నమోదు చేయాలని కోరారు. 144 సెక్షన్ కొనసాగితే నిత్యావసరాల ధరలు పెరిగే అవకాశం ఉందనే అంశాన్నీ గుర్తించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో వివిధ సంఘాల నాయకులు కె.రామారావు, ఎస్.ఆంజనేయ నాయక్, ఎస్.దుర్గాబాయి, డి.శివకుమారి, హుస్సేన్, రబ్బాని, సిలార్ మసూద్, ఇ.మస్తాన్‌రెడ్డి, సుభాష్ చంద్రబోస్, అంజిరెడ్డి ఉన్నారు.

శాంసంగ్ ఎఐ కంప్రెషర్ రిఫ్రిజిరేటర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ప్రముఖ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్ వేసవి సందర్భంగా సరికొత్తగా కంప్రెషర్ టెక్నాలజీతో కూడిన రిఫ్రిజిరేటర్లను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ కె.ఆర్.పరమేశ్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని శాంసంగ్ షోరూమ్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమా వేశంలో వివరాలను తెలియచేశారు. వినియోగదారుల అభిం˘చులకు అనుగుణంగా మూడు రిఫ్రిజిరేటర్లను తీసుకువచ్చి నట్లు తెలిపారు. ఈ కొత్త రిఫ్రిజిటరేటర్లు శాంసంగ్ యొక్క తాజా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పవర్డ్ ఇన్వర్టర్ కంప్రెషర్ టెక్నాలజీతో అమర్చబడినాయని అన్నారు. ఏఐ ఇన్వర్టర్ కంప్రెసర్, మోటారు, శక్తి సామర్థ్యాన్ని ఆప్టిమైజ్ చేయడం కోసం సాంప్రదాయకంగా రూపొందించారన్నారు.

నికాన్ కెమెరా అందజేత

ప్రజాశక్తి-విజయవాడ: ఫొటోలు లేని న్యూస్ పేపర్ వెలుగు ఇవ్వని దివిటి లాంటిదని, ఒకే ఒక ఛాయాచిత్రం వేయి పదాల అర్థాన్నిస్తుందని, ఫొటో జర్నలిస్టు తీసిన చిత్రం ప్రచరించబడి ఎన్నో జీవితాలలో మార్పు తీసుకువచ్చిన సంఘటనలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు అన్నారు. జిల్లా సమాచార శాఖకు మంజూరు చేసిన నికాన్ డీ850 మోడల్ కెమెరాను గురువారం జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు ఆయన కార్యాలయంలో సమాచార శాఖ అధికారులకు అంద జేశారు .అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేవలం ఒక ఫోటోతో ఎన్నో భావాలను బాహ్య ప్రపంచానికి తెలియజేసే అద్భుత శక్తి ఒక్క ఫోటోగ్రఫీకే ఉంటుందన్నారు. మానవ జీవితానికి ఫోటోగ్రఫీకి అవినాభావ సంబంధం ఉంటుందన్నారు. కాలగర్భంలో కలిసిపోయే ఎన్నో మధుర స్మృతులను పదిలంగా ఉంచగల శక్తి ఫోటోలకే ఉంటుందన్నారు. ప్రజలఆలోచన సరళికి పదునుపెట్టి ఓర్పు, నేర్పుతో తీసిన ఫోటోలు పత్రికలో ప్రచురించడంద్వారా ఎన్నో జీవితాలలో వెలుగులు నింపిన సంఘటనలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేయడంలో ప్రధాన భూమిక పోషించే సమాచార శాఖలో ఫోటోగ్రఫి పాత్ర కీలకం అన్నారు . అత్యంత ప్రముఖులు . ఉన్నతాదికారుల పర్యటనలు, కార్య క్రమాలను ఎప్పటికప్పుడు మీడియాకు అందజేయాలని కోరారు కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ ధికారి వి.శ్రీనివాసరావు జిల్లాసమాచార పౌర సంబంధాల అధికారి యు సురేంద్రనాద్, డిపిఆర్వో ఎస్. వి. మోహన్ రావు, పబ్లిసిటీ అసిస్టెంట్ వి. వి ప్రసాద్ ఫోటోగ్రాఫర్ ఎం. సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

యువకుల దాడిలో గాయపడ్డ డ్రైవర్ నాగేశ్వరరావు

కారు డ్రైవర్ పై యువకుల దాడి

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

కాకుమాను మండలం గార్లపాడు కు చెందిన కారు డ్రైవర్ పల్లెకోన నాగేశ్వరరావు పెదనందిపాడు కొత్త బస్టాండ్ సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా కొంతమంది యువకులు దాడి చేసి తలపై బలంగా కొట్టడంలో పడిపోయాడు. ఈ సమాచారం అనుకున్న పెదనందిపాడు పోలీసులు తమ జీవులో గాయపడ్డ నాగేశ్వరరావును చికిత్స నిమిత్తం పత్తిపాడు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గాయపడ్డ నాగేశ్వరరావును గుంటూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. బాధితుడి కొడుకు గంగాధర్ గురువారం పెదనందిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హరి ప్రసాదు, బాలరాజు, అమీర్‌లతోపాటు మరి కొందరు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పెదనందిపాడు ఎస్ఐ టి.రాజకుమార్ తెలిపారు. గంగాధర్ ను గురువారం రాత్రి ఫోన్‌లో సంప్రదించగా బాధితుడు తేరుకున్నట్లు తెలిపారు.

ఆలయభూముల సాగు విషయమై

పాల్వాయిలో ఇరువర్గాల ఘర్షణ

ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని పాల్వాయిలో గురువారం మధ్యాహ్నం జరిగిన ఘర్షణలో ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాల్వాయిలోని ఆలయ భూములను ఒకే సామాజిక వర్గం వారు సాగు చేసుకోవాలనే వ్యవహారంలో తలెత్తిన గొడవలు ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారితీసింది. ఈ ఘటనలో ఏడుగరికి గాయాలయ్యాయి. తురక మంగమ్మ, తురక వెంకటేశ్వర్లు, వేముల బాలయ్య, వేముల నాగరాజు ఒక వర్గానికి చెందిన వారికి గాయాలు కాగా, మరో వర్గానికి చెందిన దేరంగుల సాంబశివరావు, దేరంగుల వీరస్వామి, దేరంగుల శ్రీనుకు గాయాలయ్యాయి. 108 ద్వారా గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రెంటచింతల ఎస్ఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లేఖన ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - పొన్నూరు

పుట్టినరోజు అనేది శ్రేయోభిలాషులు, మిత్రులతో ఆనందంగా జరుపుకునే పండుగ లాంటిదని స్థానిక కె.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ విజయకుమార్ పేర్కొన్నారు. గురువారం లేఖన ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిట్టి పుట్టినరోజు సందర్భంగా వారి స్నేహితులు అంకిత, ఆదరణ ఫౌండేషన్ అనాథాశ్రమం నిస్సి హరణి తరపున కేక్ కట్ చేశారు. పొన్నూరులోని పేదకుటుంబాలకు, పేద పిల్లలు, వృద్ధులకు అన్నదానం చేశారు. పేదల ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని, అన్నదానం చేయడానికి ముందుకొచ్చిన లేఖన ఫౌండేషన్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కెవిఆర్ ట్రస్ట్ సభ్యులు రాజేష్, ఆశీర్వాదం, సంగీత పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న అంకిత, ఆదరణ ఫౌండేషన్ సభ్యులు

పోలీసుల అదుపులో కారంపూడి సర్పంచ్ తేజానాయక్

ప్రజాశక్తి -కారంపూడి

ఇటీవల కారంపూడిలో జరిగిన టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య గొడవ నేపథ్యంలో గొడవలలో కారంపూడి సర్పంచ్ రామావత్. తేజానాయక్ పాత్ర ఉందని భావించిన పోలీసులు మంగళవారం అర్ధరాత్రి మూడు గంటల సమయంలో సర్పంచ్ ఇంటికి వచ్చి సర్పంచ్ ను తీసుకొని వెళ్లినట్లు సర్పంచ్ కుటుంబసభ్యులు తెలిపారు. గత రెండు రోజుల నుండి తేజానాయక్ స్థానిక పోలీస్ స్టేషన్ లోనే ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవంగా పేటసన్నేగండ్ల గ్రామంలో పోతురాజుగుట్టలో జరిగిన గొడవలలో ఒక వైసీపీ కార్యకర్తను మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి. రామకృష్ణారెడ్డి పరామర్శించడానికి వస్తున్నారని తెలిసి ప్రోటోకాల్ లో భాగంగా అక్కడకు వెళ్లడం జరిగిందని, ఆ సమయంలో స్థానిక సత్యనారాయణ డాక్టర్ హాస్పిటల్ వద్ద టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరగడంతో తేజానాయక్ ను పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఇది ఇలా ఉండగా సర్పంచ్ కుటుంబసభ్యులు మీడియాతో మాట్లాడుతూ తేజానాయక్ కు ఆరోగ్య పరిస్థితి బాగుండ లేదని ఆయన బిపి, షుగర్ తో బాధపడుతున్నారని అన్నారు. ఇటీవలనే గుండె సంబంధిత వ్యాధికి గురై న ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు చెప్పారు. జరిగిన గొడవకు తమకు ఎటువంటి సంబంధం లేదని పోలీసులు ఈ విషయాన్ని గ్రహించాలని కుటుంబసభ్యులు పోలీస్ శాఖను కోరారు.

27 వరకు బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -పొన్నూరు

శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావనారాయణ స్వామి నవాహిక బ్రహ్మోత్సవాలు 15వ తేదీ నుండి ప్రారంభమయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 27వ తేదీ వరకు నిర్వహించేందుకు శ్రీ సాక్షి భావనారాయణ స్వామి దేవస్థానం సహాయక కమిషనర్, కార్యనిర్వహణాధికారి మండేపూడి పానకాల రావు, సిబ్బంది సన్నాహాలు చేస్తు న్నారు. ఫౌండర్ ట్రస్టీ, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీమంతు రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్ బహదూర్ మన్నే సుల్తాన్ దొర ఆధ్వర్యంలో ఉప ప్రధాన అర్చక పరాశరం రఘునాధబాబు పర్య వేక్షణలో శ్రీ వైఖానస సాగమాను సారముగా బ్రహ్మోత్స వాలు నిర్వహిస్తున్నారు.

17న హంస వాహనము, 18న హనుమ ద్వాహనము, 19 న సింహ వాహనము, 20 న రాజాధిరాజ వాహనము, 21న పొన్నవక్ష వాహనము, 22న గజ వాహనము, శ్రీ స్వామి వారి కళ్యాణ మహోత్సవం జరగనుంది. 23న గరుడ వాహనము అలం కారాల్లో శ్రీ స్వామి వారు భక్తులకు గ్రామోత్సవం ద్వారా దర్శనమిస్తారని ఈవో పానకాలరావు పేర్కొన్నారు. 23న శ్రీ స్వామివారి దివ్య రథోత్సవం,24న హయ వాహనము, 25 న బ్రహ్మ సరోవరంలో శ్రీ స్వామివారి తెప్పోత్సవం , 26, 27 తేదీలలో శ్రీ స్వామివారి ఏకాంత సేవలు జరుగుతాయని వివరించారు. శేష వాహనంపె గ్రామోత్సవం బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఏడు గంటలకు పెండ్లి కుమారుని ఉత్సవం 10 గంటలకు శ్రీ స్వామివారికి పంచామృత స్థపన, తిరు వంజోత్సవము నిర్వహించారు సాయంత్రం 6 గంటలకు నేతాజీ నగర్ శ్రీ సంఘం వారిచే భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు శ్రీ స్వామి వారు శేష వాహనంపై గ్రామోత్సవం చేశారు.

కార్పొరేట్, ప్రైవేట్ ఫీ'జులుం...

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పాఠశాలల పున:ప్రారంభం వచ్చేనెల అయినా తల్లిదండ్రుల్లో మాత్రం ఇప్పటి నుండే ఫీజుల భయం పట్టుకుంది. తమ బిడ్డలు బాగా చదువుకోవాలని, మంచి బడిలో చేర్పిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారనే ఉద్దేశంతో ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ ఆర్థిక స్తోమతకు మించి తమ పిల్లల చదువులకు ఖర్చు చేస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచే నాటికి ఫీజులతోపాటు పుస్తకాలు, యూనిఫాం అంటూ బోలెడంత ఖర్చులు ఉంటాయి. వీటికి ఎలా సర్దుబాటు చేసుకోవాలా? అని తల్లిదండ్రులు ఇప్పటి నుండే కంగారుగా లెక్క లేసుకుంటున్నారు.

పల్నాడు జిల్లాలో సుమారు 500కు పైగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. వీటిలో దాదాపు 1.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. పలు విద్యాసంస్థల్లో నియంత్రణ లేని ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్లే స్కూల్, నర్సరీ, ఎల్‌కెజికి రూ.10-20 వేలు, 1 నుంచి 5 తరగతులకు రూ.15-35 వేలు, 6 నుంచి 10 తరగతులకు రూ.30 వేలు నుంచి రూ.లక్ష వరకూ వసూలు చేసే కార్పొరేట్ పాఠశాలలున్నాయి. బస్సు, యూనిఫామ్, పుస్తకాలు పేరిట మరింత గుంజుతున్నారు. 1994లో జారీ చేసిన జీవో ఎంఎస్ 1 ప్రకారం ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపల్, విద్యార్థుల తల్లిదండ్రులతో ఇద్ద రితో ఒక కమిటీ నియమించి వసూలు చేసిన ఫీజులో 5 శాతం యాజమాన్యం, మిగిలిన మొత్తం పాఠశాల అభివృద్ధి, ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు, వారికి బీమా, పాఠశాల నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉంది. 2008లో విడుదల చేసిన 90, 91, 92 జీవోల ప్రకారం జిల్లా విద్యాశాఖ అధికారి, ఒక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధులతో ఒక కమిటీని జిల్లా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో నియమించాలి. జిల్లాలో ఇవి ఎక్కడా అమలు కావడం లేదు.

జీవో 53 ప్రకారం 1 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేలు, పట్టణంలో రూ.15 వేలు, నగరంలో రూ.20 వేలు ఫీజులు వసూలు చేయాలని గతేడాది విద్యా సంవత్సరం ఆరం భంలో ప్రభుత్వం ప్రకటించింది. అయితే దీనిపై కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థ యాజ మాన్యాలు కోర్టును ఆశ్రయించడంతో ఆ జీవో రద్దయింది. వారి ఫీజుల దందా కొనసాగింది. ఇప్పటికే పలు సంస్థలు అడ్మిషన్ల వేటలో పడ్డాయి. విద్యా శాఖ మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది.

ఇరుకు గదులు.. రేకుల షెడ్లు

ఫీజులను రూ.వేలు, లక్షల్లో వసూలు చేస్తున్నా సదుపాయాలు మాత్రం నాసిగా ఉంటున్నాయి. అనేక పాఠశాలలను ఆపార్టుమెంట్లు, రేకుల షెడ్డుల్లో నిర్వహిస్తున్నారు. గాలి, వెలుతురు వచ్చే విశాలమైన తరగతి గదులు ఎక్కడ కనిపించడం లేదు. ఉపాధ్యాయులకు అర్హతలతో పని లేదు. తక్కువ జీతానికి పనిచేసేవారినే నియమిస్తున్నారు. పైగా ఎవరు ఎక్కువ విద్యార్థులను పాఠశాలలో చేర్పిస్తే వారికి ఎక్కువ కమీషన్లు ఇస్తున్నారు. ప్రాథమిక పాఠశాల నిర్వహణకే అనుమతులున్నా హైస్కూల్ స్థాయి తరగతులూ బోధిస్తున్నారు. ఇక ప్రీ స్కూల్, టెక్నో, ఈ-టెక్నో, ఐఐటి, ఒలింపియాడ్ తదితర తోకలను పాఠశాల పేర్లు ముందు వెనుక తగిలించి తల్లిదండ్రులను ఆకర్షించడంతోపాటు అదనపు ఫీజులనూ దండుకుంటున్నారు.

గుర్తింపు అక్కర్లా.. నాయకుల అండ చాలు..

గుర్తింపు లేదని, వసతులు సక్రమంగా లేని పాఠశాలలపై అధికారులు చర్యలకు ఉపక్రమిస్తుంటే రాజకీయ నాయకుల అండదండలతో బయట పడుతున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సి ఉన్నా దీన్నీ అమలు చేయడం లేదు.

ఫీజులను నియంత్రించాలి

కె.సాయికుమార్, ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి

ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన విద్యా రంగం కార్పొరేట్ కబంధ హస్తాల్లో నలిగిపోతోంది. కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల ఫీజులను ప్రభుత్వం నియంత్రణ చేయడం లేదు. జీవో 53ను పటిష్టంగా అమలు చేసి ఫీజులను నియంత్రణలోకి తేవాలి. ఇందుకుగాను విద్యాశాఖాధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలి.

CHANGE OF NAME

I ARLA PANGIDIYYH alias ARLA PANGIDIAH S/o Arla Venkateswarlu, Resident of 18-6-163, Sivalayam Road, Opp: Reliance Tower, Kaza, Mangalagiri Mandal, Guntur District-522503, A.P. I have changed my name from ARLA PANGIDIYYH (Old Name) to **ARLA PANGIDIAH** (New Name) vide Affidavit dated 15.05.2024.

NOTICE
BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT GUNTUR
C.C No.128 /2023

Between
Shaik Abdul Rasheed….Complainant
And
NARDD Living Home Furniture
…..Opposite Party

To,
NARDD LIVING HOME FURNITURE,
Door No:25/231, 3 rd Lane, Postal Colony.
Near St.Anns School,Guntur,AP-522002.

పై నెంబరు C.C లో ఆపోజిట్ పార్టీ అయిన మీకు గౌరవ కమీషన్ వారి ద్వారా నోటీసులు పంపించినను మీకు ముట్టనందున గౌరవ కమీషన్ వారు మీకు నోటీసును Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:28-05-2024న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన శ్రీయుత కమీషన్ వారి యెదుట మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.

(శ్రీయుత కమీషన్ వారి అనుమతితో)

వాయిదా తేది:28-05-2024

పిల్లా సునీత,
కంప్లైనెంట్ తరపు అడ్వకేట్, గుంటూరు.

ఆ వీడియోలు, ఫొటోలు పెడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - నరసరావుపేట

నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో మూడ్రోజులుగా జరుగుతున్న రాజకీయ అల్లర్లను ఫొటోలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసేవారిని గుర్తిస్తున్నామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. ఆయా ఘటనలను వీడియోలు, ఫొటోలు తీసి ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లో పెట్టినా, వాట్సప్ స్టేటస్‌గా పెట్టుకున్నారు. వాటికి గ్రాఫిక్స్ జోడించి పాటలుగా పోస్టు చేసినా, రెచ్చకొట్టేవిధంగా రాసినా చర్యలుంటాయని పేర్కొన్నారు. వాట్సప్‌లో ఇలాంటి ప్రచారం చేస్తే గ్రూప్ అడ్మిన్, గ్రూపులో ఉన్నవారిని గుర్తించి కఠినచర్యలు తీసుకుంటామని, అందరూ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

పెదకూరపాడులో జూనియర్ కాలేజి

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని జెడ్‌పి పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ కోర్సును ప్రవేశపెడుతున్నట్లు హెచ్‌ఎం కె.వి.రమణ తెలిపారు. ఈ మేరకు కాలేజీ ఏర్పాట్లుపై పెదకూరపాడులో గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఎంపిసి, సిఇసి గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, ఒక్కో కోర్సుకు 40 సీట్లు ఉంటాయని చెప్పారు. ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తామని, ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అశాంతిని ప్రేరేపిస్తున్న శంకరరావు : ప్రవీణ్

ప్రజాశక్తి - బెల్లంకొండ

నియోజకవర్గంలో అశాంతి వాతావరణం సృష్టించేలా వైసిపి శ్రేణులను ప్రేరేపించే ఆ పార్టీ పెదకూరపాడు ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావు వంకర బుద్ధులు మానుకోవాలని ఎన్‌డిఎ కూటమి తరుపున టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. శంకరరావు ఇకనైనా ఓటమిని అంగీకరించాలన్నారు. ఈ మేరకు గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. రెండ్రోజుల క్రితం నంబూరు శంకర్రావు పెదకూరపాడులో జరిగే దాడులకు భాష్యం ప్రవీణ్ కారుకుడని చెప్పటం సిగ్గుచేటన్నారు. ఈ నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా శంకరరావు ఎమ్మెల్యే అయిన నాటినుండే గ్రామాల్లో దాడులు, కేసులు, బెదిరింపులు, అరాచకాలు మొదలయ్యాయని అన్నారు. శాంతియుతంగా ఎన్నికలు జరుగుతున్న తరుణంలో పోలింగ్ కేంద్రాల్లోకి శంకర్రావు వెళ్లి వైసిపి శ్రేణులను గొడవలకు ప్రేరేపించాలని, రౌడీ ముఖాలతో టెలికాన్ఫరెన్స్‌లు పెట్టి హడావుడి చేశారని ఆరోపించారు. ఎన్నికలు ప్రశాతంగా జరగాలంటే ప్రతిదాడులు చేయకుండా సమన్వయంతో వ్యవహరించాలని తాము కూటమి పార్టీల శ్రేణులకు చెప్పామన్నారు. పోలీసులు కూడా ఏకపక్షంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. టిడిపి శ్రేణులు సహనం కోల్పోతే జరిగే పరిణామాలను వైసిపి నాయకులు తట్టుకో లేరనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. నమ్మిన వారిని జైలుకు పంపించిన సంస్కృతి శంకర్రావుదని, ఆయన్ను నమ్మి ఎవరూ దాడులకు దిగొద్దని హితవుపలికారు. పోలింగ్ తర్వాతా దాడులు ఏమిటని? పోలీసులు స్పందించ కుంటే జరిగే నష్టాలకు వారే బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి బెల్లంకొండ మండల అధ్యక్షులు ఎన్.లక్ష్మీనారాయణ, సర్పంచ్ జ్యోతి సముద్రం, రామకృష్ణ పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రత మధ్య అభ్యర్థుల భవితవ్యం

- విజయంపై ఎవరికివారే ధీమా
- ఓటింగ్ సరళిపై లెక్కలతో సమీక్షలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పరిశీలనలో కలెక్టర్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న ముగిసిన అనంతరం ఈవిఎంలను స్ట్రాంగ్ రూములకు తరలించారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య అభ్యర్థుల భవిష్యత్ నిక్షిప్తమై జూన్ 4న వెలువడనుంది. జిల్లాలో ఈ సారి 85.69 శాతం పోలింగ్ నమోదవగా ఆయా ఈవీఎంలను భద్రపరిచే ప్రక్రియ సోమవారం రాత్రి నుండి మంగళవారం తెల్లవారుజాము వరకూ కొనసాగింది. మరోవైపు అభ్యర్థులు తమ గెలుపుపై ఎవరికివారే ధీమాగా ఉన్నారు. పోటీ ప్రధానంగా వైసిపి, టిడిపి మధ్య ఉండడంతో తాము చేసిన ప్రచారం, వచ్చిన మద్దతు, ఇచ్చిన హామీల ఆధారంగా ఎవరికి వారే ఓట్ల లెక్కలేసుకుంటున్నారు.

పల్నాడు జిల్లాలో 17,34,858 మంది ఓటర్లుండగా వీరిలో 888159 మంది మహిళలు ఓటర్లున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో మహిళా ఓటర్లు పురుష ఓటర్ల కంటే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. 14,86,594 మంది జిల్లా వాసులు తమ ఓటు హక్కు వినియోగించుకోగా వీరిలో 7,58,988 మంది మహిళా ఓటర్లున్నారు. మహిళలు అధిక శాతం ఓటు వినియోగించుకోవడం పట్ల వైసిపిలో గెలుపుపై ఆశలున్నాయి. తమ పాలనలో అన్ని పథకాలు మహిళలకే అందజేశామని, మహిళలు వైసిపిని ఆదరిస్తారని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఉద్యోగ, వ్యాపార వర్గాలు నిరుద్యోగ యువత, రైతులతో పాటు సూపర్ సిక్స్ పథకాలతో మినిఫెస్టోలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రాధాన్యమిచ్చామని, మహిళలు తమవైపు ఉన్నారని ఎన్‌డిఎ కూటమి నాయకులు చెబుతున్నారు. విభజన హామీలు, రాజధాని నిర్మాణం, ప్రాజెక్టులు ఉపాధిహామీ బలోపేతం, విశాఖ ఉక్కు పరిరక్షణ, కడప ఉక్కు పరిశ్రమ స్థాపన వంటి అంశాలపై తాము ప్రచారం చేశామని, బిజెపి, టిడిపి, వైసిపిల వైఫల్యాలను ఎండగట్టామని, కూలీలు, కార్మికుల ఓట్లు తమకూ వస్తాయని ఇండియా వేదిక అభ్యర్థులు ఆశాభావంతో ఉన్నారు.

అభ్యర్థుల్లో పెరుగుతున్న టెన్షన్

పోలింగ్ సరళీ పై అంచనా వేస్తూ గెలుపోటములపై అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తునా లోలోపల ఆందోళనగానే ఉన్నారు. ఎన్నికల ముందు ఎవరికి వారే ప్రైవేటు సర్వేలు జరిపించిన అభ్యర్థులు, ఎన్నికల తరువాత కూడా పోలింగ్ సరళిపై అంచనాలు రూపొందిస్తున్నారు. పట్టణాలు, గ్రామాల్లో వార్డుల వారీగా ఇన్‌ఛార్జులతో సమావేశమై సమీక్షిస్తున్నారు. తాము అనుకున్న ప్రకారం ఓట్లు పడ్డాయో లేదోననే ఆందోళన వారిలో నెలకొంది.

ఫలితాలపై పందేల జోరు

ప్రజాశక్తి-ఈపూరు

సార్వత్రిక ఎన్నికలు ముగియటంతో ఇరు పార్టీల ఫలితాలపై ఈపూరు మండలంలో పందాల జోరు ఊపందుకుంది. రాజకీయ నాయకులు, స్థిరాస్తి వ్యాపారులు, ఇతర వ్యాపారులు, ఆయా రాజకీయ పార్టీల కార్యకర్తలు జోరుగా పందాలు కాస్తున్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో మొదలుకొని వారి సొంత నియోజకవర్గాల్లో ఎవరు ఎంత మెజార్టీతో గెలుస్తారని బెట్టింగులకు పాల్పడుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై పుట్టుకొస్తున్న పలు సర్వేలు వీరిని మరింత ప్రేరేపిస్తున్నాయి. ఓట్ల లెక్కింపు తేదీకి పందాలు కాసేవారి సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే క్రికెట్ బెట్టింగులు గ్రామాలకు విస్తరించాయి. ఎక్కువగా యువత బెట్టింగులను వ్యసనం చేసుకొని జీవితాలను పాడు చేసుకుంటున్నారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలు ముగిసిన సందర్భంగా ఎవరికివారు తమ పార్టీ విజయం సాధిస్తుందని ఫలితాలపై రూ.లక్షల్లో పందాలు కాస్తున్నారు. కొంతమంది అత్యుత్సాహంగా తమ పార్టీ గెలుస్తుందనే ధీమాతో రూ.లక్షకు రెండు లక్షలు చెల్లిస్తామని పందేలు కాస్తున్నారు.

ఓటింగ్ అయిపోయినా నోటు కోసం వివాదాలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం పంచిన డబ్బు తమకు అందలేదని పట్టణంలోని కొన్ని ప్రాంతాల వారు స్థానిక ప్రధాన పార్టీ నాయకులను నిలదీశారు. డబ్బు పంపకంలో వివక్ష చూపారంటూ గొడవ పెట్టుకున్నారు. కొంతమందైతే ఒక ప్రముఖ పార్టీ ప్రధాన నాయకులను వారి కార్యాలయానికే వెళ్లే నిలదీయడం చర్చనీయాంశమైంది. ఒక వార్డులో అయితే కౌన్సిలర్ భర్తనే కదలకుండా కూర్చోబెట్టారు. తమకు పంచాల్సిన డబ్బులిచ్చేదాక వెళ్లనివ్వబోమని అడ్డుకున్నారు. ఇది తెలిసిన పోలీసులు అక్కడికెళ్లి సదరు వ్యక్తిని తీసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులపైనా స్థానికులు వాగ్వాదానికి దిగారు. మరోవైపు ఓటర్లకు పంచకుండా మిగిల్చిన డబ్బును తమకు తెచ్చివ్వాలని క్షేత్రస్థాయి నాయకులను ప్రధాన నాయకులు అడగడం మరో చర్చనీయాంశం. ఈ విధంగా ఒక పార్టీకి చెందిన ప్రధాన నాయకునికి అదే పార్టీకి చెందిన చోటా నాయకుడు రూ.ఆరున్నర లక్షలు ఇచ్చారని, మరో పార్టీ నాయకునికి రూ.4 లక్షలు తిరిగి ఇచ్చినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఇతర ప్రాంతాల్లో ఉండే స్థానిక ఓటర్లను ఛార్జీలు ఇస్తామని చెప్పి రప్పించి తీరా ఓటేశాక డబ్బులివ్వకపోవడంపైనా పలువురు మండిపడుతున్నారు. వీటన్నింటి నేపథ్యంలో ఒత్తిడులను తట్టుకోలేక కొంతమంది గురువారం సాయంత్రమూ డబ్బు పంచుతుండగా మిగతావారు ఎవరెప్పుడు తమపై తగువు పెట్టుకుంటారోనని భయపడుతున్నారు.

కౌన్సిలర్ భర్తను కూర్చోబెట్టిన ఓ ప్రాంతవాసులు

అప్పట్లో ఓటకు రూ.5

ప్రజాశక్తి - రెంటచింతల

ఓటు రేటు 52 ఏళ్లలో బాగా పెరిగిందని రెంటచింతలకు 17 ఏళ్లు సర్పంచ్‌గా వ్యవహరించిన అల్లం మర్రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 1972 సార్వత్రిక ఎన్నికల నుంచి ఓట్ల కొనుగోలు మొదలైందని చెప్పారు. అప్పట్లో రూ.ఐదు ఇస్తేనే ఎంతో సంతోషపడే వారమన్నారు. అభ్యర్థుల ఆర్థిక పరిస్థితులను బట్టి ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో రకమైన ధర ఉండేదన్నారు. ఓటుకు నోటు ఇచ్చే పరిస్థితి రావడంతో ఎన్నికల్లో ధనవంతులు నిలబడటం ఆరంభమైందన్నారు. 2014 ఎన్నికల్లో ఒక్క ఓటుకు రూ.వెయ్యి ఇస్తే 2019లో రూ.1500 ఇచ్చారని, ఇప్పుడు రూ.3 వేలిచ్చారని చెప్పారు. భవిష్యత్‌లో ఇది ఎటు దారితీస్తుందోనని ఊహించడం కష్టంగా ఉందన్నారు.

ఘర్షణల నేపథ్యంలో కొనసాగుతున్న 144 సెక్షన్

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల నియోజకవర్గంలో 144 సెక్షన్ విధించిన నేపథ్యంలో నాగార్జున సాగర్, విజయపురిసౌత్‌లో ఎస్‌ఐ డివి కొండారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వైసిపి, టిడిపి నాయకులను ఎస్‌ఐ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. ఎవరైనా ఘర్షణలకు, అల్లర్లకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు. విజయపురిసౌత్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తేవాలన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలో రెండోరోజు కూడా 144 సెక్షన్ అమలు కొనసాగింది. ఎన్నికల అనంతరం గ్రామాల్లో జరిగిన హింసాకాండ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం కూడా దుకాణాలను పోలీసులు ముయించారు. దూకాణాలు తెరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అత్యవసర సర్వీసులను మినహాయించారు. మెడికల్ దుకాణాలు పాల బూత్‌లు మినహా మిగతా దుకాణాలు బంద్ చేశారు. దుకాణాలు మూతపడటంతో నిత్యావసర సరుకుల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు గ్రామాలనుండి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారు సరుకులు దొరక్క అవస్థ పడ్డారు. నిత్యం రద్దీగా ఉండే వ్యాపార కూడళ్ల బోసిపోయాయి. టి దుకాణాలు మూసివేయటంతో గుక్కెడు టీ దొరక్క నిరుత్సాహపడ్డారు.

ప్రజాశక్తి - బెల్లంకొండ

ఎస్పీ ఆదేశాల మేరకు బెల్లంకొండ మండలంలో 144 సెక్షన్ శుక్రవారం అమలు కానుంది. ఎస్‌ఐ రాజేష్ మాట్లాడుతూ మెడికల్ షాపులు కూరగాయలు, పాలు దుకాణాలు మాత్రమే తెరచి ఉంటాయని తెలిపారు. ప్రజలు ఎవరు కూడా బయట తిరగరాదని, గుమ్మిగూడొద్దని కోరారు. చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సత్తెనపల్లిలో మూతబడ్డ దుకాణాలు

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ప్రక్రియకు ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి రిటర్నింగ్ అధికారులను సూచించారు.గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆచార్య నాగార్జునా యూనివర్సిటీలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించిన భవనాల్లో కౌంటింగ్‌కు సంబంధించిన టేబుళ్ళు, బారికేడింగ్, సీసీ కెమేరాల ఏర్పాట్లు, అవసరమైన ఇతర సౌకర్యాలను సంబంధిత రిటర్నింగ్ అధికారులు నిరంతరం పరిశీలించి, వెంటనే పూర్తి చేయాలన్నారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, ర్యాండమైజేషన్ ప్రక్రియలు సక్రమంగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ రోజు టేబుళ్ల వారీగా, రౌండ్ల వారీగా వివరాలు జిల్లా ఎన్నికల అధికారికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఎప్పటికప్పుడు అందించేందుకు అవసరమైన సిబ్బందిని, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ తదితర సౌకర్యాలను ముందస్తుగానే ఏర్పాటు చేసుకోవాలన్నారు.సమావేశంలో మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ జి. రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డిఆర్‌ఒ పెద్దిరోజా, ప్రత్తిపాడు ఆర్‌ఒ శ్రీఖర్, తాడికొండ ఆర్‌ఒ గంగరాజు, పొన్నూరు ఆర్‌ఒ లక్ష్మీ కుమారి, గుంటూరు పశ్చిమ ఆర్‌ఒ కె.రాజ్యలక్ష్మి , డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) కె.స్వాతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాప్రతినిధులకే బెదిరింపులు.. సామాన్యుల పరిస్థితేంటి?

మీడియాతో నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారి

ప్రజాశక్తి - తాడికొండ

ఎన్నికల సందర్భంగా గ్రామంలో జరిగిన స్వల్ప వివాదాన్ని దృష్టిలో పెట్టుకొని టిడిపి నాయకులు కత్తులు , కర్రలు , కారం , రాళ్లు, గొడ్డలితో తమ పల్లెపైకి దాడికి తెగ పడ్డారని నిడుముక్కల గ్రామ సర్పంచ్ మాదాసు రత్న కుమారి ఆరోపించారు. గురువారం గ్రామంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తాను ఎన్నికల బూత్ వద్ద నుండి వచ్చే సందర్భంలో పల్లెకు సమీపంలో ఉన్న గుజ్జర్లపూడి రమేష్ , అతని భార్య లావణ్య తనను కులం పేరుతో దూషిస్తూ తనపై దాడికి తెగపడ్డారని రత్నకుమారి ఆరోపించారు. మా జోలికి వస్తే మీ అంతు చూస్తామంటూ బెదిరిస్తున్నారని ఆమె అన్నారు. దళితులను గ్రామంలో లేకుండా తరుముతామంటూ దుర్భాశలు మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలచే ఎన్నుకోబడిన నాకే ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందని ఆమె ప్రశ్నించారు.గ్రామంలో వివాదం జరిగితే మాజీ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ టిడిపి వారిని పరామర్శించడాన్ని ఆమె తప్పుబట్టారు. గాయాలపాలైన దళితులు ఆయనకు కనిపించ లేదా అంటు ప్రశ్నించారు. మీకు అగ్రకులాలే ఓట్లు వేశారా, దళితులు ఓట్లు వేయలేదా అంటు ప్రశ్నించారు. తెనాలి శ్రావణ కుమార్ ఒక దళితుడు అయ్యుండి సాటి దళిత కాలనీని పరామర్శించకపోవడం దుర్మార్గమన్నారు. రాత్రి వేళల్లో తనపై దాడి చేసేందుకు గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇంటి ముందు రెక్కీ నిర్వహించారని తమకు ప్రాణ భయం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తమపై దాడికి యత్నించిన కొందరు పై స్టేషన్లో ఫిర్యాదు చేశామని కులం పేరుతో దూషించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాదాసు యేసు రత్నం, బాకీ వెంకటస్వామి, ధర్మరాజు కాలనీవాసులు పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గిన పసుపు ధరలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్లో గురువారం పసుపు ధరలు స్వల్పంగా తగ్గాయి. దీనితో నామమాత్రంగా కేవలం 72 కింటాలు మాత్రమే అమ్మకాలు జరిగాయి ఈ వారంలో ఎన్నికలు నిర్వహించటం తో పాటు బుధవారం ఒక విశ్రాంత ఉద్యోగి మరణించడంతో యారకు సెలవు ప్రకటించారు. దీనితో ఈ వారం యాడ్ లో అమ్మకాలు సజావుగా సాగలేదు. గతవారం ధరలతో పోల్చుకుంటే సగటు ధరలు 375 రూపాయలు తగ్గినది . గురువారం కనిష్ట ధర 12101, గరిష్ట ధర 14150 సగటు ధరలు 13700 రూపాయలు పలికినవి.

బిసిజి వ్యాక్సిన్‌తో క్షయ నివారణ

జిల్లాలో అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ ప్రారంభం - ప్రతి గురువారం ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్సీలో ప్రభుత్వం క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం అడల్ట్ బీసీజీ వాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఈ ప్రశాంత్ హాజరై వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు పైబడిన వారికి, పొగ తాగే వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు బీసీజీ వ్యాక్సినేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆశా వర్కర్స్ ఇంటింటికి వచ్చి వ్యాక్సినేషన్‌కు అర్హులైన వారిని గుర్తించడం జరుగుతుందన్నారు. ఆరోగ్య కేంద్రంలో ప్రతి గురువారం వ్యాక్సినేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రజలు వ్యాక్సినేషన్ వేయించుకొని క్షయ వ్యాధి నిర్మూలనకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీటీసీఓ డాక్టర్ శ్రీనివాస్, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రాజశేఖర్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష, హెల్త్ సెంటర్ సూపర్వైజర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

గురువారం మండల కేంద్రం దుగ్గిరాలలోని పి హెచ్ సి సబ్ సెంటర్లో బి సి జి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా పెద్ద వారికి కూడా వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో పురిటి బిడ్డలకు మాత్రమే ఈ వ్యాక్సిన్ వేసేవారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఎంపిక చేసి అందులో ఎక్కువగా క్షయ వ్యాధి బారిన పడుతున్న జిల్లాలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీటికి సంబంధించిన వివరాలను పిహెచ్సి డాక్టర్ సి ఇందిరా తెలిపారు. క్షయ వ్యాధిని నియంత్రించడానికి 18 సంవత్సరాలు దాటిన క్షయ బారిన పడిన ఐదు సంవత్సరాల లోపు వారికి క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఈ వ్యాక్సిన్ సింగల్ డోస్ గా ఇస్తున్నారు. ప్రతి గురువారం ఏఎన్ఎంలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ వ్యాక్సిన్ వలన ఎటువంటి అనర్ధాలు ఉండవని ఆమె తెలిపారు. వ్యాధి బారిన పడకుండా ముందస్తు భద్రతా చర్యగా వ్యాధి నిరోధక వ్యవస్థ మెరుగుపరచడానికి ఈ వ్యాక్సిన్ ఎంతో మేలు చేస్తుంది అన్నారు. గర్భిణి లు హెచ్ఐవి క్యాన్సర్ బారిన పడిన వారు పిల్లలకు పాలిచ్చే బాలింతలకు ఈ వ్యాక్సిన్ వేయరని తెలిపారు.

మంగళగిరిలో మహిళకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య కార్యకర్త

తాడేపల్లిలో

దుగ్గిరాలలో

కొలంకపురి నాటక కళా పరిషత్ ఆహ్వాన నాటిక పోటీలు

-సవ్యసాచి పురస్కారాన్ని అందుకున్న నటులు ఎమ్‌డి ఖాజావలి

-తొలిరోజున 'రైతేరాజు', 'విముక్తి' నాటికలు ప్రదర్శన

ప్రజాశక్తి-తెనాలి

కొలంకపురి నాటక కళాపరిషత్ దశమ ఆహ్వాన నాటిక పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. రూరల్ గ్రామం కొలకలూరు చిన్న రథశాల వద్ద వల్లేపల్లి వెంకట్రామయ్య కళాప్రాంగణలో కొలంకపురి నాటక కళాపరిషత్, హైదరాబాద్‌కు చెందిన వైకె నాటక కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనల సభా కార్యక్రమానికి వైకె కళాపరషత్ రథసారధులు కారంపూడి వెంకట్రావ్, బొప్పన నరశింహారావు జ్యోతి ప్రజ్వలన చేశారు. సభకు వైకె కళాపరిషత్ గౌరవాధ్యక్షులు వైఎస్‌కెఎన్ స్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగస్థల కళాకారులను ప్రోత్సహించేందుకు కళాపరిషత్‌లు కృషి చేస్తున్నాయని, ముఖ్యంగా కొలంకపురి నాటక కళాపరిషత్ గ్రామీణ ప్రాంతంలో పదేళ్ళుగా నాటకోత్సవాలు నిర్వహించటం అబినందనీయమన్నారు. పరిషత్ తరఫున ప్రతిఏటా అందిచే 'సవ్యసాచి' పురస్కారాన్ని ఏలూరుకు చెందిన ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు ఎండి ఖాజావలికి అందించారు. కొలంకపురి నాటక కళాపరిషత్ అధ్యక్షులు, నటులు గోపరాజు రమణ మాట్లాడుతూ ఈనెల 19వరకు నాటిక పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో గోపరాజు విజయ్, ఎస్.మురళీధర్, కాంతారావు, ఎస్.శరత్ వెంకయ్య, సుధాకర్, నూతలపాటి కాళిదాసు పలువురు కళాకారులు పాల్గొన్నారు.

సవ్యసాచి పురస్కారం అందుకుంటున్న ఖాజావలి

నాటకోత్సవాలకు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిర్వాహక పరిషత్ బృందం

రైతేరాజు నాటికలో సన్నివేశం

రైతన్న కష్టాన్ని కళ్లకు కట్టిన రైతేరాజు

నాటిక పోటీల్లో భగంగా తొలి ప్రదర్శన 'రైతేరాజు' ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆరుగాలం శ్రమిస్తున్న రైతు ఎదుర్కొంటున్న సమస్యలకు అద్దం పట్టింది. ప్రపంచంలో ఏ వస్తువు తయారు చేసినా, దాని ధర నిర్ణయించుకుని విక్రయించే అధికారం తయారీదారుకు ఉంటుందని, అయితే అందుకు భిన్నంగా రైతు పండించిన పంటకు మాత్రం ధర నిర్ణయించుకునే వీలు లేకపోవటం, నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, పంట చేతికొచ్చే సమయానికి దళారీలు, ఇలా అడుగడుగునా మోసపోతూ, వ్యవసాయంలో నష్టాలబారిన పడి ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతుల కష్టాలను నాటిక ప్రతిబింభింపచేసింది. హైదరాబాద్‌కు చెందిన కళాంజలి బృందం ప్రదర్శించిన నాటికకు రచన సూర్యప్రకాష్‌కాగా, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వ బాధ్యతలు వహించారు.

యువతకు సందేశం 'విముక్తి'

రెండో ప్రదర్శన 'విముక్తి' యువతకు సందేశాత్మకంగా నిలిచింది. కాట్రపాడుకు చెందిన ఉషోదయా కళానికేతన్ వారి ప్రదర్శనకు రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు. సమాజానికి మార్గదర్శకంగా ఉండాల్సిన యువత నేడు గంజాయి, హెరాయిన్ వంటి మత్తు పదార్ధాలకు బానిసలై, జీవితాలను నాశనం చేసుకుంటున్న వైనాన్ని, అలాంటి పరిస్థితుల నుంచి యువతను మేలుకొలపాలన్న సందేశంతో సాగింది.


రాజుపాలెంలో..

క్షయ నిర్మూలనకు అడల్ట్ బిసిజి వ్యాక్సిన్

ప్రజాశక్తి - యడ్లపాడు

క్షయను 2025 నాటికి నిర్మూలించే లక్ష్యంతో పని చేస్తున్నామని రాష్ట్ర వైద్యా రోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అర్జున రావు చెప్పారు. మండల పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బిసిజి వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. తొలుత యడ్లపాడు ఆస్పత్రిని సందర్శించిన ఆయన వ్యాక్సిన్ నిల్వలను, అనంతరం వంకా యలపాడు ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. క్షయ రాకుండా బిసిజి వ్యాక్సిన్ ఉపయోగాలను స్థానికులకు వివరించారు. వివరించారు. 60 ఏళ్లు దాటిన వారికి, 18 ఏళ్లు దాటిన వారిలో మొదటిగా గత ఐదేళ్లలో టిబి వ్యాధికి గురైనవారు, వ్యాధిగ్రస్తుల కుటుంబీకులకు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కిలోలు/చదరపు మీటర్ కంటే తక్కువ ఉన్నవారికి, పొగతాగే అలవాటున్న వారికి, మధుమేహ వ్యాధిగ్రస్తులకు వ్యాక్సిన్ వేస్తామని చెప్పారు. పల్నాడు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ యడ్లపాడు మండల పరిధిలో 464 మంది బిసిజి వ్యాక్సిన్ వేయించుకోడానికి అంగీకారం తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.ప్రభాకరరావు, డాక్టర్ భరద్వాజ, ఎస్.పున్నారావు, సిహెచ్ఒ వి.రాజశేఖర్, బి.గంగానమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-రాజుపాలెం

మండలంలోని అన్ని సచి వాలయాల్లో క్షయ వ్యాధి రాకుండా టీకాలు వేసే కార్యక్రమాన్ని రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకట కృష్ణకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గణపవరంలో వ్యాక్సి నేషన్ కార్య క్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టీకా 60 ఏళ్లు పైబడిన వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, ఐదేళ్ల లోపు క్షయ వ్యాధికి గురైన వారికి, బాడీ మాస్ ఇండెక్స్ 18 లోపు ఉన్నవారికి, పొగ తాగే అలవాటు ఉన్న వారికి, క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్న వారి కుటుంబ సభ్యులకు అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ వేస్తారని డాక్టర్ వెంకటకృష్ణ కుమార్ తెలిపారు. మండలంలో 450 మందికి అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు జీవనరావు పాల్గొన్నారు.

టిడిపి నేత సిద్ధయ్యకు నేతల పరామర్శ

ప్రజాశక్తి - రెంటచింతల

సార్వత్రిక ఎన్నికలకు ముందు రోజు ఆదివారం వైసిపి వర్గీయుల దాడిలో గాయపడిన సన్నగంటి సిద్దయ్యను మండల టిడిపి నేతలు గురువారం పరా మర్శించారు. ఆయన కుడి చేతి వేలు విరగడంతో నరస రావుపేటలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సిద్ధయ్యను పరా మర్శించిన వారిలో మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు గొంటు సుమంత్‌రెడ్డి, బోడపాటి రామకృష్ణ, నల్ల బిరుదు నరసింహారావు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-ఈపూరు

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఏవి రంగనాయకులు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నం దున సాధా రణ సమీక్ష నిర్వహిస్తామని మండల ప్రాదేశిక సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరవ్వాలని కోరారు.

దోమకాటు ఆరోగ్యానికి చేటు

- జాతీయ డెంగీ దినోత్సవం
- ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆర్.సి.హెచ్ నారాయణ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ దోమకాటు ఆరోగ్యానికి చేటు అని, నీటి నిల్వలను ఉంచరాదని అవి దోమల వ్యా ప్తికి పుట్టినిల్లని అన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించాలని సూచించారు. దోమలు కుట్టకుండా వేపాకు, లిక్విడ్స్ తప్పనిసరిగా వాడాలన్నారు. అంతేకాకుండా దోమ తెరలు, దోమల నివారణ చర్యలు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చల మారెడ్డి, శివయ్య, జిలాని కోటేశ్వరరావు, సయ్యద్ పీర్ పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో..

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని మలేరియా సబ్ యూనిట్‌లో జాతీయ డెంగీ దినోత్సవ వేడుకలు యూనిట్ అధికారి డి.లక్ష్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.రెండు వారాలకు మించి నీటి నిల్వలను ట్యాంక్‌లలో ఉంచకూడదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విపి సౌత్ సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, సిబ్బంది టి.నాగేశ్వరరావు, బాలయ్య, బాషా, దానం పాల్గొన్నారు.

మాచర్లలో..

సమన్వయంతో పనిచేయాలి

మలేరియా యూనిట్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని మాచర్ల పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇళ్ళ ముందు మురుగు కాల్వలను శుభ్రం చేయకపోతే వచ్చే రోగాల గురించి ముందుగా మున్సిపల్ సిబ్బందికి అవగాహన కల్పించాలని కోరారు. పట్టణంలో చెత్తకుప్పల తొలగింపులో అలసత్వం, దుర్వాసన వంటి వాటిపై మున్సిపల్ సిబ్బంది, అధికారులకు అవగాహన వస్తే పట్టణ ప్రజల ఆరోగ్యం మెరుగుపడే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు.

సరైన శిక్షణలేకనే ప్రమాదాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట మండలం ఈపూరువారిపాలెంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో టిప్పర్‌ను ఢీకొట్టిన ఘటనలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఆరుగురు కాలి బూడిద కాగా మరో 12 మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి కారణం సరైన శిక్షణ లేని డ్రైవర్ నిర్లక్ష్యమే. ప్రస్తుత కాలంలో కాలంతో పాటు పరిగెత్తే

వాహ నాలు ఉన్నాయి కానీ శిక్షణ తీసుకున్న డ్రైవర్లు ఉండట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. శిక్షణ ఇచ్చిన తర్వాతే వాహనాలను వారికి ఇవ్వాలనే ఆలోచన లేక పోవడం వల్లే ఈ ప్రమాదానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. బస్సు, టిప్పర్‌ను ముందు భాగంలో ఢీ కొట్టడం, టిప్పర్ మధ్య భాగంలోని డీజిల్ ట్యాంక్ పగిలి పోయింది. టిప్పర్‌ను వేగంగా వచ్చిన బస్సు ఢీ కొట్టడం డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే జరిగిందని అంటున్నారు. ప్రస్తుతం ప్రమాదం జరిగిన ప్రాంతంలో రోడ్లు ఎగుడు దిగుడుగా ఉండటం, కుంగటం, వేగంగా వెళ్తున్న కార్లు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకు వెళ్లిన సంఘటనలు చాలా వున్నాయి. ప్రస్తుతం రోడ్ల విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నా యి. అయితే, ప్రస్తుతం నిర్మిస్తున్న బై పాస్ చీరాల నుంచి చిలకలూరిపేట వరకు సుమారు 45, 50 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఎక్కడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, జాగ్రత్తలు తీసుకోక పోవడంతో ఈ ఘోర ప్రమాదానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రైవేట్ ట్రావెల్స్ బ స్సులు బయలు దేరే ముందు డ్రైవర్లకు వైద్యుల వద్ద చెకప్ చేయిం చాలని, అలాగే, మార్గమధ్యంలో వారు మద్యం సేవించి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే వారిని చెకప్ చేసేందుకు ఎమర్జెన్సీ వైద్య సెంటర్లను ఏర్పాటు చేయాలని, బస్సు కండిషన్ కచ్చితంగా ఉండేలా చూడాలని, అతి వేగం నిరోధించాలి. రోడ్ల నిర్మాణంలో తీసుకోవాల్సిన పూ ర్తిస్థాయి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇలాంటి ప్రమాదాలు జరిగిన సమయంలో తీవ్రంగా గాయపడ్డ వారి ప్రాణాలు రక్షించేందుకే చిలకలూరిపేట పట్టణంలో ట్రామా కేర్ లేదు. దీంతో, మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరుకు తీసుకువెళ్లే పరిస్థితి. ఈ తరహా ప్రమాదాల్లో ప్రాణాలతో కొట్టుమిట్టాడే వారు మెరుగైన వైద్యం కోసం (గోల్డెన్ పిరియాడ్) గుంటూరు వెళ్లే లోపే ప్రాణాలు పోగొట్టుకున్న వారు చాలామందే ఉన్నారు. చిలకలూరిపేట ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో సక్రమమైన వైద్య సౌకర్యాలు లేవు. ఇప్పటికైనా పట్టణంలో ట్రామామాకేర్ సౌకర్యాన్ని కల్పిం చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాద ఘటనలో గాయాలపాలై చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

తప్పులతడకగా రహదారి దూరం బోర్డు

గుంటూరు -ఫిరంగిపురం మధ్య దూరం తప్పుగా ఉన్న చిత్రం

ప్రజాశక్తి-నాదెండ్ల

తప్పుల తడకగారహదారి పక్కన నగరాల దూరాన్ని తెలిపే కిలోమీటర్ల బోర్డులు తప్పులు తడకగ ఉన్నాయి. మండలంలోని సాతులూరు గ్రామం వద్ద గుంటూరు -ఫిరంగిపురం దూరాన్ని తెలిపేందుకు ఏర్పాటు చేసిన బోర్డులో కిలోమీటర్లు తప్పుగా ఉన్నాయి. ఈ బోర్డును చందవరం సెంటర్ వద్ద ఏర్పాటు చేశారు. సాతులూరు నుండి ఫిరంగిపురానికి 17 కిలోమీటర్లు అయితే ఈ బోర్డులో 6 కిలోమీటర్లుగా ఉంది. సాతులూరు నుండి గుంటూరుకి 38 కిలోమీటర్లు అయితే ఇది కేవలం 20 కిలోమీటర్లు ఉన్నట్లు సూచిస్తోంది. దీనిపై ప్రయాణికులు విమర్శలు కురిపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి తప్పుగా ఉన్న కిలోమీటర్ల సంఖ్యను సరి చేయాల్సిందిగా కోరుతున్నారు.

బటన్ నొక్కినా డబ్బులు ఖాతాల్లో వేస్తారా?

పలు పథకాల లబ్ధిదారుల ఆందోళన

ప్రజాశక్తి - మాచర్ల

ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే పలు సంక్షేమ పథకాలకు బటన్ నొక్కి నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విడుదల చేయలేదు. ఆ తరువాత పోలింగ్‌కు రెండు రోజుల ముందు నిధులు విడుదల చేస్తామంటు ప్రభుత్వం చెప్పడంతో ఎన్నికల కమిషన్ అభ్యంతరం వ్యక్తం చేయడం, పోలింగ్ తరువాత నిధులు విడుదల చేసు కోవచ్చని చెప్పడం తెలిసిందే. అయితే, పోలింగ్ పూర్తయి మూడు రోజులు దాటినా నిధులు విడుదల కాకపోవడంపై మాచర్ల ప్రాంతంలోని లబ్దిదారులు ఆందోళన చెందుతున్నారు. విద్యాదీవెన, వసతి దీవెన, వైఎస్ఆర్ చేయూత, ఆసరా, ఈబిసి నేస్తం వంటి మొదలైన పథకాలకు సంబంధించిన నిధులు వస్తాయని ఎదురుచూస్తున్న లబ్దిదారులు నిరాశ చెందుతున్నారు. నిధుల సొమ్మును సంక్షేమ పథ కాలకు కాకుండా కాంట్రాక్టర్స్‌కు బిల్లులు చెల్లిస్తారనే వదంతులు వస్తుండటంతో ఆయా పథకాల లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో డెంగీ దూరం

జిల్లాలో డెంగీ నివారణపై అవగాహనా ర్యాలీలు

సురక్షితమైన రేపటి కోసం మా బాధ్యత అనే నినాదంతో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం మే 16వ తేదీన నిర్వహిస్తున్నది.ఈక్రమంలో జాతీయ డెంగీ నివారణా డే సందర్భంగా గురువారం జిల్లాలో మలేరియా విభాగం ఆద్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. డెంగీ నివారణకు పలు సూచనలు చేశారు.

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం 9:30 గంటలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్.కె.విజయలక్ష్మి, ముత్యాలరెడ్డి పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. డెంగీ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నినాదాలు చేస్తూ, ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ సాగింది. దోమల ఎదుగుదలను నివారించడం, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించడం, సాయంత్రం వేళల్లో వేప పొగ వేయడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి నిల్వల పరి శుభ్రత, దోమతెరలు వాడడం లాంటి చర్యలు తీసుకోవడం వల్ల దోమకాటును నివారించవచ్చని తద్వారా డెంగీ వ్యాధిని అరికట్టవచ్చని డిఎంహెచ్ఓ తెలిపారు.ప్రతి ఒక్కరూ దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గీతా పద్మజ మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని అరికట్టాలని అన్నారు. రాబోయే వర్షాకాలంలో వర్షం నీరు నిల్వలు చూసుకోకుండా ప్రతి ఇంటిలోనూ పరిసరాలను నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి నివారించుకోవాలని కోరారు. దోమలు వృద్ధి చెందకుండా లార్వాదశలోనే వాటిని నిర్మూలించి డెంగీ వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని అన్నారు. కార్యక్రమంలో హెచ్ ఈ ఓ వెంకటేశ్వరావు, సూపర్వైజర్స్ సాగర్, సైదులు, కే శ్రీనివాసరావు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మంగళగిరిలో

మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్సీలో డెంగీ నివారణపై అవగాహన కల్పించారు. యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు డెంగీ వ్యాధి నివారణా చర్యలు, లక్షణాలు గురించి అవగాహన కల్పించారు. డెంగ్యూ వ్యాధి ఏడిస్ అనే పగటి పూట కుట్టే దోమ వలన వస్తుందన్నారు. జ్వరము, తలనొప్పి, వాంతులు, శరీరంపై ఎర్రటి దద్దుర్లు, కీళ్ల నొప్పులు, ముక్కు వెంట రక్తం కారుట, నీరసం, ప్లేట్లెట్స్ తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. డెంగ్యూ లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ఆరోగ్య కేంద్రాలను సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ సూపర్వైజర్ జయలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్, హెల్త్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో గణపతినగర్ పిహెచ్‌సిలో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - దుగ్గిరాల

గురువారం మండల కేంద్రం దుగ్గిరాలలోని పి హెచ్ సి సబ్ సెంటర్లో డెంగీ నివారణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు .ఈ సందర్భంగా డాక్టర్ ఇందిర మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాల్లో మురుగునీటి నిలువ వలన మలేరియా మంచి నీటి నిల్వ వలన డెంగీ వ్యాపింపజేసే దోమలు ప్రబలుతాయి అన్నారు. కుండీలు, కొబ్బరి బోండాలు లాంటి వాటిలో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరాల బారిన పడిన వెంటనే స్థానిక పీహెచ్సీ సెంటర్‌కు రావాలని అన్ని రకాల పరీక్షలు నిర్వహించి తక్షణ చికిత్స అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది జి శ్రీనివాస్ షేక్ ఆశ జానమ్మ లలిత కుమారి విమల బుజ్జి పాల్గొన్నారు.

దుగ్గిరాలలో

ప్రజాశక్తి తెనాలి

జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఉప వైద్యాధికారిణి డాక్టర్ ఇ అన్నపూర్ణ ఆధ్వర్యంలో మలేరియా సబ్ యూనిట్ కార్యాలయం నుండి శివాజీ చౌక్ మీదుగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ దీని ముఖ్య ఉద్దేశ్యం ప్రజలలో డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన కల్పించి, వ్యాధిని అరికట్టడమేనని చెప్పారు. ఈ వ్యాధి దోమకాటు ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని, దోమల పెరుగుదల నియంత్రణ ద్వారానే అరికట్టగలమన్నారు. 2024 జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారిద్దాం' అని నినాదాన్ని ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ షేక్ బీబి జాన్, సహాయ మలేరియా అధికారి సిహెచ్ ప్రభాకరరెడ్డి, సిబ్బంది ఎ బాలచంద్రమౌళి, ఎస్ ఉమాకాంత్, జి రవికుమార్, జంగం శ్యామ్, పి రవికుమార్, ప్రసన్న పుష్పలత ,డి శ్రీనివాసరావు, బి మల్లేశ్వరరావు, డి. శివనాగమల్లేశ్వరరావు, ,శివరామ ప్రసాద్, షేక్ రషీద్, నవీద్, ఎం రత్నాకర్ , షేక్ భాషిత్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

తెనాలిలో

పది ఫలితాల్లో అసాధారణ ఫలితాలు సాధించిన

నారాకోడూరు జడ్‌పి పాఠశాల విద్యార్థులు



ప్రజాశక్తి - చేబ్రోలు

సాధారణ విద్యార్ధులతో అసాధారణ ఫలితాలు ప్రతీ సంవత్సరం సాధిస్తున్న పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ నారాకోడూరు అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై ఏడుకొండలు ఓ ప్రకటనలో తెలిపారు. పేద విద్యార్థులకు మంచి అభివద్ధి వేదిక మా పాఠశాల అన్నారు. 2024 - 25 విద్య సంవత్సరానికి గాను పాఠశాల విద్యార్థుల అడ్మిషన్లు జరుగుతున్నావని తెలిపారు. పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పూర్తిస్థాయిలో సామర్థవంతమైన మౌలిక సౌకర్యాల ఏర్పాటు ఉన్నాయని అన్నారు. అనుభవం అర్హత నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు తో గుణాత్మకమైన సమర్థవంతమైన బోధనలు కలిగిన పాఠశాల జడ్పీహెచ్ఎస్ నారా కోడూరు అని తెలిపారు. క్రమశిక్షణ నైతిక విలువలు ఉత్తమ విద్యా బోధనతో 2024 పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మంచి ఫలితాలు సాధించడం జరిగిందని అన్నారు. ఎస్ ఎస్ సి ఫలితాల్లో ప్రతిభ సాధించిన మా ఆణిముత్యాలు బి చిత్రలేఖ 578, డి హరి గోపాల్ 525, కె సూర్యప్రకాష్ 5 24, డి హరి ప్రకాష్ 5 23, జి నికిత 515,కె నీలిమ 509, పి దేవిక 505, సల్మా సుల్తానా 505, డి మణికంఠ 504, ఈ భువనేశ్వరి 503 ల కు పాఠశాల ఉపాధ్యాయ బందం మరియు తల్లిదండ్రుల కమిటీ గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేయడం జరిగిందని అన్నారు. పాఠశాల నుండి మొత్తం 183 మంది పరీక్షలు హాజరుకాగా, 143 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.పాఠశాల ఉత్తీర్ణత శాతం 81 కాగా, ప్రథమ శ్రేణిలో 90 మంది విద్యార్థులు, ద్వితీయ శ్రేణిలో 40 మంది విద్యార్థులు, తతీయ శ్రేణిలో 18 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

అవగాహన ఆధ్వర్యంలో ఆత్రేయ జయంతి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో గురువారం మనసు కవి ఆత్రేయ జయంతి నిర్వహించారు. సంస్థ మనమూ పాడుదాం రండి బృంద సభ్యులు ఆత్రేయ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అవగాహన సాంస్కృతిక కార్యక్రమాల కోఆర్డినేటర్ బి.అశోక్ మాట్లాడుతూ సినిమా పాటల్లో తేలికైన పదాలతో ఎంతో బరువైన భావాలను పలికించిన ఆత్రేయను సినీ వేమన అనవచ్చన్నారు. ఆత్రేయ మనసున్న కవి అని, మనోభావం, సామాజిక స్పృహ, జాతీయ భావాలు, భాషాభిమానం, దేశాభిమానం, స్వాభిమానం, మనసు తత్వాన్ని కాచి వడపోసిన తత్వ చింతకుడు అనవచ్చన్నారు. గాయకులు టి. సాయిబాబు మాట్లాడుతూ ఆత్రేయ నాటక, సినీ పాటల రచయితగా నాలుగు దశాబ్దాలపాటు తనదైన ప్రత్యేక శైలిని ప్రదర్శించారన్నారు. ఆకలి, రిక్షావాలా, ఎన్‌జిఒ, అశోక్ సామ్రాట్ వంటి అపురూపమైన నాటకాలు రాసి నాటక రంగానికి ఎనలేని సేవలు అందించారని, ప్రేమ, భగ్నప్రేమలపై ఆత్రేయ రాసిన గీతాలు ప్రేక్షకుల మనసులపై చెరగని ముద్ర వేశాయన్నారు. కార్యక్రమంలో రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, గాయకులు మల్లేశ్వరరావు, రాజశేఖర్, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ఆత్రేయ గేయాలు ఆలపించారు.

ఆత్రేయ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అవగాహన సభ్యులు

పోలింగ్ వివరాలు ఇవ్వడంలో గోప్యత

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌ల వివరాలు అందజేయడంలో అధికారులు గోప్యత పాటిస్తున్నారు. ఎందుకు ఈ విధంగా వ్యవహరిస్తున్నారో దీని వెనుక ఆంతర్యం ఏమిటని ప్రజలు మల్లగుల్లాలు పడుతున్నారు. పోలైన ఓట్ల వివరాలు వెల్లడించానికి అధికారులు ఎందుకు వెనకాడుతున్నారని చర్చనీయాంశమైంది. పోలింగ్ జరిగి మూడు రోజులు గడిచినా బూత్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలు ఇవ్వడానికి అభ్యంతరం ఏమిటని అధికారుల తీరును ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో ఎంత మంది ఓటు హక్కు వినియోగించుకున్నారో టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో పది నిముషాల్లో సమాచారం అందించవచ్చని ఓటర్లు చెబుతున్నారు. పోలైన ఓట్ల వివరాలు అందించకుండా రాజకీయ నాయకులు ఒత్తిడి ఏమైనా ఉందా అని ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో 300 బూత్‌లలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాత్రి 12 గంటల వరకు కూడా కొన్ని పోలింగ్ బూత్‌లలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాజకీయ పార్టీల నాయకులు ఓట్ల వివరాలు అడిగినా ఆన్‌లైన్‌లో చూసుకోమంటున్నారు తప్ప వివరాలు ఇవ్వడంలేదని వివిధ పార్టీల నేతలు చెబుతున్నారు.

మెల్లెంపూడిలో వడదెబ్బకు వృద్ధుడు మృతి

మృతిచెందిన కంచర్ల దేవ సహాయం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని మెల్లెంపూడి లో గ్రామానికి చెందిన కంచర్ల దేవ సహాయం (78) గురువారం వడదెబ్బ తో మతి చెందాడు. దేవ సహాయం తమ్ముడు కొడుకు కంచర్ల కళ్యాణ్ టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్, టిడిపి గుంటూరు పార్లమెంట్ నాయకులు పటాన్ కాసిం ఖాన్, టిడిపి గ్రామ అధ్యక్షులు షేక్ నాగుల్, తెలుగు యువత నాయకులు ఎస్కే కాసింబాబు, వైఎస్ఆర్సిపి గ్రామ నాయకులు బి. అజార్ రెడ్డి తదితరులు దేవ సహాయం మతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు.

23న గిరిప్రదక్షణకు ఆర్టీసీ స్పెషల్ బస్

ప్రజాశక్తి-గుంటూరు

అరుణాచలంలో ఈనెల 23వ తేదీన పౌర్ణమి సందర్భంగా జరిగే గిరిప్రదక్షణ మహోత్సవాలకు వెళ్లే యాత్రికుల కోసం ఆర్టీసి గుంటూరు డిపో-2 నుండి స్పెషల్ హైటెక్ బస్ ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ షేక్.అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈబస్ మే 21వ తేదీ రాత్రి 9.15 గంటలకు గుంటూరులో బయలుదేరి, 22వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీ పురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని, అదే రోజు రాత్రి అక్కడ నుండి బయలు దేరి పౌర్ణమి రోజు (మే 23న) ఉదయం అరుణా చలం చేరుకుంటుందన్నారు. అరుణా చలేశ్వరుని దర్శనం అనంతరం అదేరోజు సాయంత్రం అరుణాచలంలో బయలుదేరి మే 24వ తేదీ ఉదయం 6:30 గంటలకు గుంటూరు చేరుతుందన్నారు. ఈ సర్వీస్‌కు 96164 నెంబర్ ద్వారా ఆన్లైన్ రిజర్వేషన్ చేసుకొనే అవకాశం అవకాశం ఉందని, కావున ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. టికెట్ ధర రూ.2420లు అని చెప్పారు. అదనపు సమాచారం కోసం 7382897459,7382896403, 7382894409 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐల్లో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కళాశాలల్లో 2024-25 మొదటి విడత అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలని పల్నాడు జిల్లా కన్వీనర్ ఆర్ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.ఎస్.వి ప్రసాద్ బాబు కోరారు. గురువారం ప్రసాద్ బాబు విలేకరులతో మాట్లాడుతూ టెన్త్ పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులకు చివరి తేదీ జూన్ 10వ తేదీ సాయంత్రం 5గంటలకు ముగియనుందన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు **ఐటిఐ.ఎపి.జిఓవి.ఇన్** వెబ్‌సైట్ అందుబాటులో ఉందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 18 నుండి 26 వ తేదీ లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. మాచర్ల ఐటిఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్ వంటి రెండు సంవత్సరముల కోర్సులతోపాటు, డీజిల్ మెకానిక్ వెల్డర్ ఒక సంవత్సరం కోర్సులలో ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

19న జాబిల్లి పుష్పం ఆవిష్కరణ సభ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో మే 19 సాయంత్రం 6 గంటలకు స్థానిక బందావన్ గార్డెన్స్‌లోని గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో డాక్టర్ రవూఫ్ కవితా సంపుటి 'జాబిల్లి పుష్పం' ఆవిష్కరణ సభ జరుగుతుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్ఎం సుభాని గురువారం పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ చిల్లర భవానీదేవి అధ్యక్షతన జరిగే ఈసభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పుస్తకావిష్కరణ, ప్రముఖ కవి ప్రసాదమూర్తి పుస్తక సమీక్ష చేస్తారన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రచయిత కాట్రగడ్డ దయానంద్ పాల్గొంటారని సాహితీప్రియులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని చలపాక ప్రకాష్, ఎస్ఎం సుభాని కోరారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, తదితరులు

జెవివి ఆధ్వర్యంలో టీచర్లకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మే 19న ఆదివారం లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో 10వ తరగతి నూతన పాఠ్యపుస్తకాలపై ఉపాధ్యాయులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలియజేశారు. గురువారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో శిక్షణా తరగతుల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం, ఆంగ్లం పాఠ్యపుస్తకాలపై శిక్షణ ఉంటుందని, శిక్షణను ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఉపాధ్యాయులు అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం 9948015701 నంబరులో సంప్రదించాలని సూచించారు. పోస్టర్ ఆవిష్కరణలో టి.ఆర్.రమేష్, బి.ప్రసాద్, జి.వెంకటరావు, టి.ఆర్.చాందిని, సుబ్బరాయుడు, బి.ఉదయ్ భాస్కర్, శంకర్‌సింగ్, యం.ఉదయభాస్కర్, ఎస్ఎం.సుభాని, ఇ.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్కా హాస్పిటల్‌లో అత్యాధునిక సిటీ స్కానర్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్కా హాస్పిటల్‌లో గురువారం అత్యాధునిక '32 స్లైస్ జిఇ-డిస్కవరీ, జెన్-2-పిఇటి-సిటి స్కానర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అండ్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పవన్ రాఘవరెడ్డి కల్లూరి, డైరెక్టర్ అండ్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ హేమంత్ మాకినేని, డైరెక్టర్ అండ్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ డి.ఎస్.రాజునాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలోనే మొదటిసారిగా ఈ అత్యాధునిక సాంకేతికత మెడికల్ ఇమేజింగ్, డయాగ్నస్టిక్స్ రంగంలో గణనీయమైన పురోగతిని సూచిస్తుందని అన్నారు. క్యాన్సర్ రోగులకు అత్యున్నత వైద్య ప్రమాణాలు, వ్యాధి సంరక్షణ అందించటానికి ఉపయోగపడు తుందన్నారు. ఇది ఖచ్చితమైన, స్పష్టమైన ఇమేజింగ్ అందిస్తుందని, పిఇటి ఇమేజింగ్ అందించిన జీవక్రియ సమాచారంతో సిటి స్కాన్ శరీర నిర్మాణ సంబంధమైన వివరాలను మిళితం చేస్తుందన్నారు. దీని ద్వారా వివిధ క్యాన్సర్‌లను ముందస్తుగా గుర్తించటం, ఖచ్చితమైన స్టేజింగ్, ఖచ్చితమైన పర్యవేక్షణ కోసం ఒక అమూల్యమైన సాధనం అన్నారు. ఈ స్కానర్ క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స సామర్థ్యంలో కొత్త శకాన్ని సూచిస్తుందని డాక్టర్ పవన్ రాఘవరెడ్డి పేర్కొన్నారు. ఈ అధునాతన సాంకేతికత క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించటానికి సహాయం చేస్తుందని, గుంటూరు పరిసర ప్రాంత రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

నూతన సిటీ స్కానర్‌పు ప్రారంభిస్తున్న వైద్యులు

పోలింగ్ నమోదులో రాష్ట్రంలో పల్నాడు జిల్లా 3వ స్థానం

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌తో కలిపి 86.06 శాతం నమోదు
ఈవీఎంలు ధ్వంసం చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు
పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

ఎన్నికల వివాదాల్లో పాల్గొన్నవారిపై కఠిన చర్యలు
100 మందికిపైగా అరెస్టు, 22 మంది రిమాండ్‌కు తరలింపు
పల్నాడు జిల్లా ఎస్‌పి జి.బిందుమాధవ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గత ఎన్నికల్లో సమస్యత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన నియోజకవర్గాలలో పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించామని అయితే ప్రస్తుత ఎన్నికలలో మాత్రం సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు సజావుగా జరిగాయని ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం వివాదాలు జరిగిన ప్రాంతాలలో పోలీసు బందోబస్తు పటిష్టంగా అమలు చేయలేకపోయామని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ గరికపాటి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో గురు వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 4 సమస్యాత్మక నియోజక వర్గాలను గుర్తించిన ఎన్నికల సంఘానికి 34 కంపెనీలకు చెందిన పోలీసు బలగాలను ఏర్పాటు చేయాలని సూచించామని అయితే 19 కంపెనీలకు చెందిన 4 వేల మంది సిబ్బందిని మాత్రమే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అత్యంత సమస్యాత్మక మాచర్ల నియోజక వర్గంలో పోలీసు వ్యవస్థ పటిష్టంగా పనిచేసిందని లేకుంటే మాచర్లలో జరిగిన హింసాత్మక ఘటన గురించి యావత్ భారతదేశం చర్చించు కోవాల్సిన పరిస్థితి దాపు రించేదన్నారు. ఈవీఎంలు ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుం దని ఎట్టి

మీడియాతో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పి

పరిస్థితుల్లో వారిని ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఎస్పీ మాట్లా డుతూ ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ ఎంతో కష్టపడి పని చేసిందని సమస్యాత పోలీస్ స్టేషన్లో పరిధిలో జరిగిన ఘటనలో సంబంధించి నిందితులను అదుపులోకి తీసుకో వడం జరిగిందని వారిపై నాన్ బైయిల్ కేసులు నమోదు చేశామన్నారు. వెబ్ కాస్టింగ్ కెమెరాల ద్వారా మిగిలిన నిందితులను కూడా గుర్తించి కఠిన కేసులు నమోదు చేస్తామన్నారు. పల్నాడు లో ప్రశాంత వాతావరణకు కల్పించేందుకు పోలీసు శాఖ నిష్పక్షపాతంగా పనిచేస్తుం దన్నారు. మాచర్ల నియోజకవర్గంలో 5 పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు ధ్వంసం చేశా రని వీరిలో 4 ఈవీఎంలు ధ్వంసం కేసులలో నిందితులను అదుపులోకి తీసుకున్నా మని ఒక ఈవీఎం ధ్వంసం చేసిన వారి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మాచర్ల నియోజకవర్గంలో పిన్నెల్లిలో రాళ్ళ పెట్రోల్ బాటిల్స్, మాచవరం గ్రామంలో నాటు బాంబులు స్వాధీనం చేసుకున్నామన్నారు. గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్టి త్రిపాఠి పల్నాడు జిల్లాలోనే ఉండి పోలీసులకు ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తున్నారన్నారు. నరసరావుపేట నియోజకవర్గం లో వంద మందికిపై కేసులు నమోదు చేశామని 22 మందిని రిమాండ్‌కు తరలించామని 200 మందికి పైగా అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టాల్సి ఉందన్నారు. అత్యంత సమస్యత్మక ప్రాంతాలలో కూడా 80 శాతం పోలింగ్ నమోదు కావడం వెనుక పోలీసు కృషి నిదర్శనం అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేందుకు తాము నిష్పక్షపాతంగా పనిచేసినప్పటికీ పార్టీల నేతలు జిల్లా ఎన్నికల యంత్రాంగం మరియు పోలీస్ యంత్రాంగాన్ని తప్పుపట్టడాన్ని ఎస్ పి జి బిందు మాధవ్ ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ రోజున ఆయా వివాదాలకు సంబంధించి తనకు 1000కి పైగా ఫోన్లు వచ్చాయని ప్రతి ఫోన్ కి తాను స్పందించానని అయినప్పటికీ ఆయా రాజకీయ పార్టీల నేతలు తనను విమర్శించడం పట్ల తమ విజ్ఞతకే వదిలేస్తున్నానని ఆయన అన్నారు.

మూతపడిన దుకాణాలు - నిర్మానుష్యంగా వీధులు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణంలో గురువారం కూడ 144వ సెక్షన్ కొనసాగింది. దుకాణాలన్ని మూతపడ్డాయి. వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురైనారు. మాచర్ల నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా జరిగిన హింస, అల్లర్లతో పట్టణంలో బుధవారం నుండి 144 సెక్షన్ కొనసాగుతుంది. పోలింగ్ రోజున మాచర్ల పట్టణంలో, చుట్టు ప్రక్కల గ్రామాలలో పెద్దఎత్తున హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. పలువురు తీవ్రంగా గాయ పడ్డారు. పలు వాహనాలు ధ్వంసం అయి నాయి. పోలింగ్ మరుసటి రోజున పలు చోట్ల హింసాత్మక ఘటనలు జరగటంతో ఏ క్షణాన ఏమి జరుగుతుందో అని నియోజకవర్గ ప్రజలు భయం గుప్పిట్లోకి వెళ్ళారు. పట్టణం, పలు గ్రామాలలో కర్రలు పట్టుకోని గ్రామాలలో కలియతిరుగుతూ తెల్లారే వరకు కాపాల కాసారు. నియోజకవర్గాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు తీవ్రమైన అంక్షలు కొనసాగిస్తుండటంతో కొంత మేర గొడవలు సద్దుమణిగినట్లు కనిపిస్తుంది. అయినా ముందుస్తు చర్యలలో భాగంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. వందల మంది పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తు, గుంపులు గుంపులుగా జనం తిరగకుండా కఠిన చర్యలు చేపడు తున్నారు. ఎన్నికల రోజు సోమవారం నుండి మా వ్యాపారాలన్ని దెబ్బతింటున్నాయని ఎన్నికల అనంతరం గొడవలు జరగటం, గోడవల సందర్భంగా 144వ సెక్షన్ విధిం చటంతో మా పొట్ట గోట్టినట్లు అయిందని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూకుమ్మడి దాడులు పెద్దఎత్తున జరుగు తుండటంతో, వాటిని అదుపు చేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు తెలియ జేస్తున్నారు. నాయకులు చేసిన తప్పిదాలకు చిరువ్యాపారులు ఇబ్బంది పడు తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2వ రోజూ 144 సెక్షన్ అమలు - పోలీసుల పహారాలో మాచర్ల

పూట గడవటం కష్టం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : నిత్యం కర్ఫ్యూ వాతావారణం ఉంటే మా బతుకులు ఎలా తెల్లరుతాయని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్లతో మాచర్ల పట్టణం కేంద్ర బలగాల పహరా నీడలోకి వెళ్ళింది. 144 సెక్షన్ అమలులో ఉండటంతో పట్టణంలోని అన్ని వ్యాపార సముదాయాలు మూతపడినాయి. ఇంకా రెండు రోజులు ఇదే పరిస్థితి కోనసాగవచ్చునని పోలీసు వర్గాల సమాచారం. ఉదయం 10 గంటల వరకు అమ్మకాలకు అవకాశం ఉండటంతో, ఆ కొద్ది సమయంలోనే వ్యాపారులు వ్యాపారం చేసుకోవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో పచ్చి సరకును తోపుడు బండ్లపై అమ్మకాలు కోనసాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయాలు, అరటి, మామిడి, ద్రాక్ష, సపోటా, పూలు ఒక రోజుకు మించి నిల్వ ఉండే పరిస్థితులు లేకపోవటంతో ఉన్న సరకు అమ్మకాలు జరగక వ్యాపారులు నష్టపోతుండగా, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసే వారికి వ్యాపారం సాగక నష్టపోతున్నారు. ఏ రోజుకి ఆ రోజు సంపాదనతో మా జీవితాలు తెల్లరుతాయని, ఇలా వ్యాపారాలు లేకపోతే మాకు తింటానికి కూడ ఇబ్బందులు పడుతున్నామని అరిటి కాయాల వ్యాపారి యార్ల ఏసుదాసు ఆవేదన వ్యక్తం చేశారు.